క్లుప్తంగా

మృతురాలి కుటుంబానికి పరామర్శ



చెన్నమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఉష శ్రీచరణ్, రామచంద్ర

పెనుకొండ రూరల్: గొల్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వైశాలి జయశంకర్‌రెడ్డి మాతృమూర్తి ఆళ్లగడ్డ చెన్నమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ గురువారం గ్రామానికి చేరుకొని చెన్నమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ నరసింహులు, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, కొండలరాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు

హిందూపురం అర్బన్: పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు డీఎస్పీ కేవీ మహేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హిందూపురం సర్కిల్ పరిధిలో రాత్రి 10 గంటల తరువాత సరైన కారణం లేకుండా ఎవరూ రోడ్లపై తిరగరాదన్నారు. ప్రధానంగా హోటళ్లు, రెస్టారెంట్లు, కమర్షియల్ దుకాణాలు రాత్రి పది గంటల్లోపు బంద్ చేయాలని తెలిపారు. ఈ నిబంధనలు ఈ నెల 11 నుంచి అమల్లోకి వస్తాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలను సీజ్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, సైలెన్సర్ తీసేసిన ద్విచక్ర వాహనాలు కనిపిస్తే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో సీఐలు రాజగోపాల్ నాయుడు, అంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

మైలు నంబర్ రాయి ఏర్పాటు



అధికారులు ఏర్పాటు చేసిన నంబర్ రాయి

సాక్షి ఎఫెక్ట్..

పెనుకొండ రూరల్: పెనుకొండ– కొత్తచెరువు దారిలో గురువారం అధికారులు దూరాన్ని తెలిపే నంబర్ రాయి ఏర్పాటు చేయించారు. పెనుకొండ నుంచి కొత్తచెరువు మార్గ మధ్యంలో రాంపురం వద్ద రెండు రకాల దూరాలను తెలిపేలా నంబర్ రాళ్లు ఏర్పాటు చేశారు. దీనిపై గత సోమవారం సాక్షిలో 'అసలు దూరం ఎంత?' శీర్షికన కథనం వెలువడింది. స్పందించిన అధికారులు నిర్దిష్ట దూరం తెలిపే నంబర్ రాయిని ఏర్పాటు చేయడంతోపాటు అదనంగా ఉన్న నంబర్ రాళ్లను తొలగించారు.


వీల్ చైర్ అందజేత

పావగడ: తాలూకాలోని సీకే పురానికి చెందిన వెంకటేశ, రోజ దంపతుల కుమారుడు అజయ్‌కు స్థానిక శ్రీ క్షేత్ర ధర్మ స్థలం గ్రామీణాభివృద్ధి సంస్థ వీల్ చైర్ అందించింది. నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగుడిని ముందుకు సాగేలా చేసింది. సంస్థ యోజనాధికారి మహేశ్ జన మంగళ పథకం కింద బాధితుడికి వీల్ చైర్ అందించాడు. అజయ్ తల్లి తండ్రులు వెంకటేశ్, రోజ దంపతులు సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

సాగు నీటి సంఘాలకు ఎన్నికలు

అగళి: మండల పరిధిలోని అగళి, ఇనగలూరు, రావుడి, కోడిపల్లి, ఇరిగేపల్లి, మధూడి, హళ్లికెర, 7 చెరువు నీటి సంఘలకు సంబంధించిన ఎన్నికలు ఈ నెల 23న జరగనున్నట్లు తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు. ఆయా గ్రామంలో చెరువులకు సంబంధించిన ఆయకట్టుదారుల జాబితాను ఆయా గ్రామ సచివాలయంలో గురువారం ప్రదర్శించారు. ఎవరికైనా అభ్యంతరాలుంటే తహసీల్దార్ కార్యాలయంలో తెలపాలన్నారు.

సబ్సిడీపై పరికరాలు



రైతులకు బిందు తుంపర సేద్యం సామగ్రిని అందిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ ఏఓ నరసింహప్ప తెలిపారు. గురువారం రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ల పరికాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బిందు తుంపర సేద్యం పరికరాల వినియోగంతో తక్కువ నీటితో ఎక్కువగా పంటను సాగు చేసుకోవచ్చన్నారు. పరికరాల వినియోగంపై అవగాహన కల్పించారు. అర్హత ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఊపందుకోని రబీ సీజన్

- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- సీజన్ ప్రారంభంలో నామ మాత్రంగా నమోదైన పంటల సాగు విస్తీర్ణం
- రబీ సీజన్ నుంచి ఉచిత పంటల బీమాను రద్దు చేసిన కూటమి సర్కార్
- పంటల సాగుపై ఆసక్తి చూపని రైతులు
- ఈ ఏడాది సాధారణ పంటల సాగు విస్తీర్ణం అనుమానమే



వేరుశనగ సాగు (ఫైల్)

మండలం	సాధారణ సాగు	సాగైన విస్తీర్ణం
	(హెక్టార్లలో)	(హెక్టార్లలో)
మడకశిర	745	07
అమరాపురం	714	16
గుడిబండ	838	00
రొళ్ల	465	16
అగళి	225	68
మొత్తం	2987	107

మడకశిర: మడకశిర వ్యవసాయ డివిజన్ పరిధిలో ఈఏడాది రబీ సీజన్‌లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది.డివిజన్ పరిధిలో మడకశిర, అమరాపురం , గుడిబండ,రొళ్ల,అగళి మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో ఏటా రబీ సీజన్‌లో వివిధ పంటల సాగుకు రైతులు ఎంతో ఆసక్తి చూపే వారు. ఇందుకు కారణం గత ప్రభుత్వ హయాంలో రైతులకు అందిన ప్రోత్సాహమే. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నన్నాళ్లు రైతులను అనేక రకాలుగా ప్రోత్సహించారు. అయితే కూటమి సర్కార్ వచ్చాక రైతులకు చేయూత కరువైంది. దీంతో రైతులు రబీ సీజన్‌లో పంటల సాగు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఫలితంగా ఈఏడాది రబీలో సాధారణ పంటల సాగు విస్తీర్ణం కూడా అనుమానంగా మారింది.

107 హెక్టార్లలో మాత్రమే పంటల సాగు

ఏటా రబీలో రైతులు వివిధ పంటలను సాగు చేస్తారు. ప్రధానంగా వేరుశనగ పంటను ఎక్కువగా సాగు చేస్తారు. అంతే కాకుండా పత్తి, రాగి, వరి, మొక్కజొన్న, చిరుధాన్యాలు తదితర పంటలను కూడా సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతారు. ఈఏడాది నియోజకవర్గంలో 2,987 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా. ఇంత వరకు రైతులు నామమాత్రంగా పంటలను సాగు చేశారు. కేవలం 5 మండలాల పరిధిలో 107 హెక్టార్లలో మాత్రమే రబీలో వివిధ పంటలను సాగు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పంటల సాగు ఆశించిన స్థాయిలో లేదని భావిస్తున్నారు.

ఉచిత పంటల బీమా రద్దు ప్రభావం

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ వచ్చి రాగానే ఉచిత పంటల బీమాను రద్దు చేసింది. ఈఏడాది రబీ సీజన్ నుండే ఉచిత పంటల బీమాను రద్దు చేసింది. ఈ ప్రభావం రబీ సీజన్‌లో సాగు చేసే పంటలపై పడింది .రైతులు సొంత డబ్బుతో బీమా ప్రీమియంను చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారు. పంటలను సాగు చేయడానికి రైతుల్లో ఆసక్తి తగ్గింది. వైఎస్ జగన్ హయాంలో ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేశారు. ప్రభుత్వమే రబీ, ఖరీఫ్‌లో సాగు చేసే పంటలకు బీమా ప్రీమియంను చెల్లించి రైతులను ఆదుకుంది. అయితే చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే రైతులను నట్టేట ముంచారు. ఉచిత పంటల బీమాను రద్దు చేసి రైతులను కోలుకోని దెబ్బతీయడంతో రబీ సీజన్‌లో పంటల సాగు ఆశించిన స్థాయిలో ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రైతులకు పెట్టుబడి సమస్య

రబీ సీజన్‌లో పంటల సాగుకు రైతులకు పెట్టుబడి కూడా ఎంతో అవసరం. రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో రబీలో రైతులకు పెట్టుబడి సమస్య కూడా ఎదురైంది. వైఎస్ జగన్ హయాంలో రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద ప్రతి ఏడాది రూ. 13,500 క్రమం తప్పకుండా అందేది. అంతే కాకుండా సరసమైన ధరలకు ఆర్బీకేల ద్వారా రైతులకు ఎరువులు అందేవి. నాణ్యమైన విత్తనాలు కూడా అందేవి.అయితే చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆర్బీకేలు నిర్వీర్యమైపోయాయి. రైతులకు అందాల్సిన సేవలు నిలిచి పోయాయి. ప్రధానంగా అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించి ఆదుకుంటానని చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి 5 నెలలు అవుతున్నా రైతులకు పెట్టుబడి సాయం అంద లేదు.

సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది



రబీ సీజన్ ప్రారంభంలో ఇంత వరకు రైతులు 107 హెక్టార్లలో వివిధ పంటలను సాగు చేశారు. ఈసాగు విస్తీర్ణం ఇంకా పెరిగే అవకాశం ఉంది. రబీలో పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం కూడా రైతులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. సబ్సిడీతో రైతులకు అవసరమైన వేరుశనగ విత్తనాన్ని అందిస్తున్నాం. సాధారణ విస్తీర్ణంలో పంటలు సాగయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– కృష్ణమీనన్, ఏడీఏ, మడకశిర

పంటల బీమా కొనసాగించాలి



కూటమి సర్కార్ వచ్చి రాగానే రైతులను దెబ్బ తీసింది. దీంతో రబీలో పంటల సాగు తగ్గిపోయింది. ప్రధానంగా రబీ సీజన్ నుంచే ఉచిత పంటల బీమాను రద్దు చేయడం అన్యాయం. ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడం లేదు. చాలామంది అప్పు లు చేసి పంటలు సాగు చేసే పరిస్థితి నెలకొంది.

– చిత్తయ్య, జీజీహట్టి, రొళ్ల మండలం

ప్రభుత్వ ప్రోత్సాహం కరువు



రబీలో పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. దీంతో ఈఏడాది రబీలో పంటలను సాగు చేయడానికి వెనుకంజ వేస్తున్నాం. పెట్టుబడి సాయం అందక పోవడంతో ఇబ్బందులు పడుతుతున్నాం. అప్పు చేసి రబీలో పంటలు సాగు చేయలేం.ప్రభుత్వమే వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసింది. వైఎస్ జగన్ హయాంలో ఆనందంగా పంటల సాగు చేసే వాళ్లం.

– నాగరాజు,టీడీపల్లి,రొళ్ల మండలం

రైతులతో ఫీల్డ్ అసిస్టెంట్ దురుసు ప్రవర్తన



ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఈసీ శివప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

రొద్దం: పండ్లతోటల బిల్లులు పెట్టాలని కోరిన రైతులతో ఓ ఫీల్డ్ అసిస్టెంట్ దురుసుగా ప్రవర్తించాడు. గొబ్బరంపల్లికి చెందిన కుళ్లాయప్ప, చోళేమర్రికి చెందిన తిమ్మయ్య, నాగరాజు గతేడాది డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద మామిడి మొక్కలు నాటారు. అయితే వారికి 10 నెలలుగా పండ్ల తోటల బిల్లులు మంజూరు కాక పోవడంతో బుధవారం అధికారులకు ఫిర్యాదు చేసేందుకు ఉపాధి హామీ కార్యాలయానికి వచ్చారు. తమకు ఫీల్డ్ అసిస్టెంట్ బిల్లులు పెట్టడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్తుండగా ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో బిల్లులు పెట్టేది లేదంటూ ఫీల్డ్ అసిస్టెంట్ రవి వారితో దురుసుగా ప్రవర్తించాడు. దీంతో వారు ఈసీ శివప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమకు రావాల్సన బిల్లులు చెల్లించడం లేదని, బిల్లుల కోసం ఎంపీడీఓ కార్యాలయాలని వచ్చి అధికారులకు చెప్పుతుండా ఫీల్డ్ అసిస్టెంట్ తమతో వాగ్వాదానికి దిగాడన్నారు. గ్రామంలో పండ్ల మొక్కలు సాగు చేసిన ఆనందమ్మ అనే మహిళకు సంబంధించిన జాబ్ కార్డును తొలగించారని చెప్పారు. ఎంపీడీఓ, ఏపీఓకు పలుమార్లు ఫిర్యాదు చేసిన వారు స్పందించడం లేదని ఆరోపించారు.

ముర్రుపాలలో వ్యాధి నిరోధకశక్తి అధికం



పౌష్టికాహార లోగో విడుదల చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ప్రతి తల్లీ తమ పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న సూచించారు. గురువారం స్థానిక ఆస్పత్రిలోని మాతాశిశు కేంద్రంలో న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శిశు ఆరోగ్య సంరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన తర్వాత గంటలోపు ముర్రుపాలు తాపించాలని పేర్కొన్నారు. ముర్రుపాలలో వ్యాధి నిరోధకశక్తి అధికంగా ఉంటుందన్నారు. బిడ్డకు సక్రమంగా పాలు పట్టడం వల్ల తల్లికి కూడా ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు. ఆరు నెలల అనంతరం తల్లిపాలతో పాటు ఇంట్లో వండిన అదనపు ఆహారాన్ని ఇవ్వాలని సూచించారు. పోత పాలు, రసాయనిక ఆహార పదార్థాలు ఇవ్వడం వల్ల పిల్లల ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. ప్రసవం తర్వాత మూఢనమ్మకాలను విడనాడి సరైన పౌష్టికాహారాన్ని తీసుకుంటే బిడ్డకు అవసరమైన పాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్తు సమాజానికి ఆరోగ్యవంతమైన యువతను అందించాలన్న ఉద్దేశంతో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం పౌష్టికాహారానికి సంబంధించిన లోగో విడుదల చేశారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ బాబాబుడేన్, చిన్నపిల్లల వైద్యుడు అఫ్తాబ్, ప్రభుత్వ ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ ఓబుళమ్మ, సుశీల, న్యాయవాదులు కళావతి, నవేరా, సంతోషి కుమారి, పార్వతి, భాగ్య, హబ్సా, లోక్‌అదాలత్ శారద తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించడానికి చర్యలు

- డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్



మడకశిరలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న తిప్పేంద్ర నాయక్

మడకశిర: మడకశిర ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్ తెలిపారు. ఆయన గురువారం పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలను తనిఖీ చేశారు. అదేవిధంగా నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి భవనాల నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. ఆ తర్వాత మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శశిరేఖ, డాక్టర్లతో ఆయన సమావేశం నిర్వహించి ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఓపీపైనా ఆరాతీశారు. సాధారణ ప్రసవాలు పెంచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రి భవన నిర్మాణ పనులు పూర్తయితే రోగులకు శస్త్ర చికిత్సలు, ఇతర మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

కర్ణాటక మద్యం అమ్మితే చర్యలు



పట్టుబడిన కర్ణాటక టెట్రా ప్యాకెట్లతో ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య

హిందూపురం అర్బన్: కర్ణాటక మద్యం విక్రయం, రవాణా చేసే వారిపై చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. గురువారం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని హిందూపురం, కొడిగేపల్లి, నరసాపురం, శేషాపురం, సీగుపల్లి, సీతారామపురం, మోడల్ కాలనీల్లో మద్యం విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. అశ్వర్థనారాయణ, శీనా, సర్పుద్దీన్, నాగరాజు, గోవిందప్ప, విజయ్‌కృష్ణ, రియాజ్ ఖాన్ నుంచి కర్ణాటక రాష్ట్రానికి చెందిన 716 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసి, మూడు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. రెండు కేసులు నమోదైన ఓ వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు. అలాగే ముగ్గురు పాత ముద్దాయిలను హిందూపురం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఒక్కొక్కరితో రూ.లక్ష పూచీకత్తు తీసుకుని, వదిలేశారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు పృథ్వీరాజ్, ఫరూక్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మృతులకు నివాళి

పెనుకొండ: గుట్టూరు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పీఈటీ రమేష్ కుమార్తె సాయి భవిత మృతి చెందగా, పీఈటీ కూడా గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. వీరి మృతిపై యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్, నారాయణస్వామి, నరేష్, రమేష్, నబి, వైఎస్సార్‌టీఏ నేత కాడిశెట్టి శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ శ్రీనివాసులు, జవాజి రమేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబానికి సంతాపం తెలియజేశారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం.రమణారెడ్డి

అమరాపురం: మండలంలోని బసవనపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో అండర్–17 బాలికల విభాగంలో యు.సించన ప్రతిభ కనబరిచింది. అండర్–14 బాలుర విభాగంలో ఏజె రజనీకాంత్ రాష్ట్రస్థాయి ఖోఖోపోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రమణారెడ్డి, పీడీ కదరప్ప తెలిపారు.

క్యాన్సర్ పై అవగాహన

సోమందేపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యుడు హరి కుమార్ మాట్లాడుతూ ధూమపానంతోపాటు గుట్కా తీసుకోవడంతో క్యాన్సర్ వస్తుందన్నారు. తల్లులు తమ పిల్లలకు పాలు ఇవ్వడం ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్ నుంచి బయట పడవచ్చన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మనోహర్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు రవీంద్ర, రత్నమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

హిందూపురం అర్బన్: హిందూపురం మండలం తూమకుంట 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. గోళ్లాపురం, తూమకుంట, చౌళూరు, సంతేబిదనూరు, బేవనహళ్లి, ఊడుగుల పల్లి, నక్కలపల్లి, సంజీవరాయణపల్లి, కిరికెర, బసనపల్లి, దేవరపల్లి, కొటిపి, కగ్గల్లు, సుబ్బిరెడ్డిపల్లి, అప్పలకుంట గ్రామాల పరిధిలో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ భూపతి తెలిపారు.

చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలి

పావగడ: చట్ట బద్ధంగా పిల్లలను దత్తత తీసుకోవాలని, లేని పక్షంలో శిక్ష లు తప్పవని స్థానిక తహసీల్దార్ వరదరాజు హెచ్చరించారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన దత్తత స్వీకార మాసోత్సవంలో ఆయన మాట్లాడుతూ అనాథ పిల్లలను చట్ట బద్ధంగా దత్తత తీసుకొని తమ సొంత బిడ్డల్లా పోషించాలన్నారు. అయితే అక్రమంగా పిల్లల్ని తీసుకుంటే చట్ట పరంగా శిక్షలు విధిస్తామన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి సునీత తదితర అంగన్‌వాడీ కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ చేశారు.

మహిళా చట్టాలపై అవగాహన

రొద్దం: ఎల్‌జీబీనగర్ గ్రామంలో అనంతశక్తి సొసైటీ న్యాయ సలహాల మండలి ఆధ్వర్యంలో గురువారం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. గృహహింస, బాల్యవివాహాలు తదితర చట్టాలపై మహిళలకు నాటిక రూపంలో తెలియజేశారు. ఈ సందర్భంగా అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య మాట్లాడుతూ ప్రతి మహిళా చట్టాలపై అవగాహనతో ఉండాలన్నారు. ఎక్కడైన మహిళలు గృహహింస, లైంగిక వేధింపులకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.


వ్యాధులపై అప్రమత్తం చేయండి

రొళ్ల: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని డాక్టర్ చిదానంద్, పీహెచ్‌ఎన్ సుధారాణి తెలిపారు. గురువారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆరోగ్య, ఆశా వర్కర్లకు సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇంటింటా సర్వే చేపట్టాలని తెలిపారు. జ్వరం, డయేరియాతో బాధపడుతున్న వారిని గుర్తించి, విలేజ్ హెల్త్ క్లినిక్ లేక స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. టీబీ సూపర్ వైజర్ సాయికృష్ణ పాల్గొన్నారు.


మహాసభలు జయప్రదం చేయాలి

హిందూపురం టౌన్: విజయనగరంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకూ జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య చేతుల మీదుగా మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ కృషి చేస్తోందని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి, నాయకులు పవన్, గోపి, జహీద్, నూర్, అమీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి సేవా రత్న ప్రశస్తికి ఎంపిక



ప్రకాశ్ నాయక



లోకేశ్ పాళేగార్

పావగడ: తాలూకా వ్యాప్తంగా సామాజిక, విద్య రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రకాశ నాయక, లోకేశ్ పాళేగార్, సిద్దేశ్వరప్ప రాష్ట్ర స్థాయి వాల్మీకి సేవా రత్న ప్రశస్తి కి ఎంపికయ్యారు. దొడ్డబళాపురానికి చెందిన మహర్షి శ్రీ వాల్మీకి గురుకుల పీఠాధిపతి శ్రీ వాల్మీకి బ్రహ్మానంద గురూజీ నేతృత్వంలో ఈ నెల 9న బెంగుళూరు గాంధీ భవన్ బాపు మీటింగ్ హాలులో వారికి ప్రశస్తిలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

పరిగి: మండల కేంద్రంలో గురువారం యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మహంతేష్, ఉపాధ్యక్షుడు బాబు ఆధ్వర్యంలో మండల కమిటీ ఎన్నిక జరిగింది. సమాఖ్య మండల అధ్యక్షురాలిగా సత్యవతి, ప్రధాన కార్యదర్శిగా సుల్తాన్, ట్రెజరర్‌గా నరసింహమూర్తి, గౌరవాధ్యక్షుడిగా బాబా ఫక్రోద్దీన్, ఉపాధ్యక్షురాలిగా శ్రీదేవి, రాజు, సీపీఎస్ కన్వీనర్‌గా శేఖర్, జిల్లా కార్యదర్శులుగా మహంతేశ్వర్, శంకరప్ప, మహమ్మద్ షఫీ, సుకన్య, రామకృష్ణ, ఖాజావలి ఎన్నికయ్యారు.

గుండెపోటుతో వ్యాపారి మృతి



బాబులాల్ (ఫైల్)

హిందూపురం అర్బన్: పట్టణంలో ప్రముఖ వ్యాపారి బాబులాల్ గురువారం చెన్నైలో గుండెపోటుతో మృతి చెందారు. ఇతడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య, ఒక కుమారుడు అమెరికాలో ఉండగా.. మరో కుమారుడు స్థానికంగా ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. పట్టణంలో వీరికి సైకిల్ దుకాణం ఉంది. విషయం తెలుసుకున్న పలువురు బాబులాల్ మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

భావితరాలకు ఆచార్య ఎన్‌జీ రంగా ఆదర్శం



ఎన్జీ రంగా జయంతి వేడుకలను జరుపుకుంటున్న దృశ్యం

మడకశిర రూరల్: మండలంలోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ డీన్ సరోజినిదేవి ఆధ్వర్యంలో ఆచార్య ఎన్‌జీ రంగారావు జయంతి వేడుకలను గురువారం జరుపుకున్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ స్టూడెంట్ యాక్టివిటీస్ ఆఫీసర్ డాక్టర్ సుమతి, అధ్యాపకులు, పాల్గొన్నారు.

మట్కాబీటర్ల అరెస్ట్

లేపాక్షి: లేపాక్షి పంచాయతీలో మట్కా నిర్వహిస్తున్న ముగ్గురు బీటర్లును గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. వారి నుంచి రూ.16 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరందరినీ కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నిందితుడికి రిమాండ్

పరిగి: హత్యాయత్నం కేసులో నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. 2021లో గొరవనహళ్లి బస్టాండ్ సమీపంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో అనిల్‌కుమార్ నిందితుడు. బెయిల్‌పై బయటికొచ్చిన అనిల్‌కుమార్ తదనంతరం కోర్టు వాయిదాలకు వెళ్లలేదు. ఈక్రమంలో కోర్టు ఆదేశాల మేరకు గురువారం పోలీసులు గొరవనహళ్లికి వెళ్లి నిందితుడిని పట్టుకుని కోర్టులో హాజరుపర్చారు. జడ్జి ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

పబ్‌లో కౌన్సిలర్ల చిందులు



పబ్‌లో డ్యాన్స్ చేస్తున్న కౌన్సిలర్లు

హిందూపురం: హిందూపురం మున్సిపల్ చైర్మన్ స్థానం దక్కించుకునేందుకు టీడీపీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్లను ఇప్పటికే క్యాంప్‌కు తరలించారు. గురువారం హైదరాబాద్‌లోని రిసార్ట్, పబ్‌లో కౌన్సిలర్లు డ్యాన్స్‌లతో చిందులు వేశారు. వార్డు కౌన్సిలర్లుగా ఎన్నికైన వీరు ప్రజాసమస్యలను గాలికి వదిలేసి ఎంజాయ్ చేస్తుండటంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు రెండు రోజుల్లో నోటిఫికేషన్ వెలువడుతుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో పథకం ప్రకారం నోటిఫికేషన్ విడుదల అయ్యే వరకూ వారందరూ హిందూపురంలో అడుగుపెట్టకుండా టీడీపీ నాయకులు అన్ని రకాలుగా చూసుకుంటున్నారు.

ప్రత్యామ్నాయ భవనాలు చూపాలి

హిందూపురం అర్బన్: హిందూపురం న్యాయస ముదాయంలో ప్రస్తుతం జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ప్రత్యేక మెజిస్ట్రేట్ న్యాయస్థానాలు శిథిలావస్థకు చేరాయి. ప్రత్యామ్నాయ భవనాలు చూపాలని హిందూపురం బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. గురువారం వారు అమరావతిలో పలువురు న్యాయమూర్తులను కలిసి సమస్యలను విన్నవించారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో న్యాయవాదులు రామచంద్రారెడ్డి, సిద్దా, సుదర్శన్, నాగరాజు రెడ్డి ఉమ్మడి అనంతపురం జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ మహేశ్వర రావు, హైకోర్టు రిజిస్ట్రార్లు కమలాకర్‌రెడ్డి, శ్రీనివాసశర్మను కలిశారు. తాత్కాలిక భవన సముదాయాలను పరిశీలించనున్నట్లు హైకోర్టు న్యాయమూర్తులు హామీ ఇచ్చారు.